



మొక్క నాటి నీరు పోస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే

ఇంటికో మొక్క నాటుదాం


• కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్, ఆగస్టు 9: ఇంటికో మొక్కను నాటి భావితరానికి ప్రాణవాయువును అందిద్దామని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఫారెస్ట్ డివిజన్ కార్యాలయంలో మొక్కలు నాటి నియోజకవర్గంలో అటవీశాఖ చేపడుతున్న మొక్కల పెంపకంపై డీఎఫ్‌వో నిఖితను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరు కనీసం ఒక్క మొక్కనైన నాటితే భవిష్యతు తరాలకు ప్రాణవాయువును అందించిన వారవుతారని అన్నారు. భూమికి పచ్చని చెట్లే అందనిస్తాయని తెలిపారు. ప్రతీ ఏడాది ఎండల తీవ్రత పెరిగిపోతుందని ఇష్టారీతిన చెట్లను నరికివేయడాన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అటవీ శాఖ అధికారులపై ఉందని అన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు కేటాయించిన మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి నిఖిత, ఎస్‌సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, కమిషనర్ సుజాత, మున్సిపల్ కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.



- కస్టం మిల్లింగ్ రైస్‌ను సకాలంలో అందించని మిల్లర్లు
- నేటికీ ప్రభుత్వానికి చేరని కస్టం మిల్లింగ్ రైస్
- మూడు సీజన్‌లకు సంబంధించి ధాన్యం మిల్లుల్లోనే..
- కస్టం బియ్యం ఇచ్చేందుకు సంబంధం లేని కారణాలు చెప్తున్న వైనం
- గోదాంలు ఖాళీలేవంటూ సాకులు
- జిల్లాలో 136 రా.. మరో 35 బాయిల్డ్ రైస్‌మిల్లులు

లక్ష్యం చేరని సీఎంఆర్



కామారెడ్డి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) లక్ష్యం చేరడంలేదు. సీఎంఆర్ విధించిన గడువు ఈనెల చివరికల్లా ముగియనుంది. అయినా జిల్లాలో ఇంకాచాలా మిల్లులు నిర్దేశించిన లక్ష్యానికి దూరంగా ఉన్నాయి. ఇటీవల కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సీఎంఆర్ రైస్‌పై సంబంధిత శాఖాధికారులతో పాటు రైస్ మిల్లర్లతో సమావేశం అయ్యారు. గడువులోగా సీఎంఆర్ రైస్ ఇవ్వని రైస్‌మిల్లులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో భాగంగా సీఎంఆర్ రైస్ సకాలంలో ఇవ్వని మిల్లులకు నోటీసులు జారీ చేసేందుకు పౌరసరాఫరాల శాఖ సిద్ధమవుతోంది. గత వానా కాలం సీజన్‌కు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ బియ్యం అప్పగించాల్సిందేనని ఇక గడువు ఇచ్చేదే లేదని తెల్చిచెప్పారు. ఇప్పటికే పలుమార్లు గడువు ఇచ్చామని, అయినప్పటికీ కొన్నిమిల్లుల యాజమాన్యాలు పెద్ద ఎత్తున బియ్యం బకాయి పడ్డాయి. ఇలా జిల్లాలో సీఎంఆర్ రైస్ మిల్లుల నుంచి సేకరించడంలో అధికారులు సీరియస్ తీసుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.



మరోవైపు ప్రభుత్వానికి సీఎంఆర్ రైస్ కేటాయించడంలో మిల్లర్లు సైతం నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు గోదాంలు ఖాళీ లేకపోవడంతో సీఎంఆర్ ఇవ్వడం లేదనే పలు సాకులు చెబుతున్నారు.

జిల్లాలో 179 రైస్‌మిల్లులు

కామారెడ్డి జిల్లావ్యాప్తంగా 179 రైస్‌మిల్లులు ఉన్నాయి. ఇందులో 136 రా రైస్‌మిల్లులు ఉండగా, మరో 35కి పైగా బాయిల్డ్ రైస్‌మిల్లులు ఉన్నాయి. జిల్లాలోని పలు గ్రామాల్లో ఏర్పాటుచేసిన 578 రేషన్ దుకాణాల ద్వారా ప్రతీనెల పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 2.53లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఈ కార్డుల ద్వారా ప్రతీనెల 5462 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని పౌరసరాఫరాల శాఖ ద్వారా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో రేషన్‌బియ్యం పంపిణీకి ప్రతి ఏటా రెండు సీజన్‌లలో రైతులు పండించే ధాన్యాన్ని రైస్‌మిల్లుల్లో మర ఆడించి బియ్యంగా మార్చి పేదలకు పంపిణీ చేస్తుంటారు.

మూడు సీజన్ల సీఎంఆర్ మిల్లుల్లోనే..

జిల్లాలో మూడు సీజన్‌లకు సంబంధించి ధాన్యం మిల్లుల్లోనే ఉండిపోయింది. 2022-23 వానకాలం సీజన్‌లో 1.70లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉండగా 22వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారు. 1.48 లక్షల మెట్రిక్ టన్నులు మిల్లర్లు బకాయిలో ఉన్నట్లు సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు. 2023-24 వానాకాలం సీజన్‌లో 2.98 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్ ఇవ్వాల్సి ఉండగా 98వేల మెట్రిక్ టన్నులు సీఎంఆర్ రైస్ ఇచ్చారు. ఇంకా 2లక్షల మెట్రిక్ టన్నుల బకాయిలు ఉన్నారు. 2023-24 యాసంగి సీజన్‌లో 2.19 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్‌ను మిల్లర్లు ఇవ్వాల్సి ఉండగా 45 వేల మెట్రిక్ టన్నులు ఇచ్చారు. 1.74లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ మిల్లర్లు బకాయిలో ఉన్నట్లు పౌరసరఫరాలశాఖాధికారులు చెబుతున్నారు.

గడువు ఇచ్చేదే లేదంటున్న అధికారులు

రైతుల నుంచి కొనుగోలుచేసిన ధాన్యాన్ని జిల్లాలోని పలు రైస్‌మిల్లులకు ప్రభుత్వం కేటాయించింది. ఈనెల చివరి వరకు ఇవ్వాలని ప్రభుత్వం మిల్లర్లకు గడువు ఇచ్చింది. అయితే ఈ గడువులోపు మిల్లర్లు నుంచి ఇంకా సీఎంఆర్ బియ్యం అందిస్తారో లేదోచూడాలి. సకాలంలో సీఎంఆర్ రైస్ అందించని పలురైస్ మిల్లు యాజమానులకు నోటీసులు ఇచ్చిన స్పందించడం లేదని అధికారులు చెబుతున్నారు. అయితే గడువు ముగిసినా సీఎంఆర్ ఇవ్వని మిల్లులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి. వానాకాలం సీజన్‌దే కాకుండా యాసంగి సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ రైస్‌కు కూడా పూర్తిస్థాయిలో మిల్లర్ల నుంచి రాలేదు. అయితే సెప్టెంబర్ చివరికల్లా వానకాలం సీజన్‌లకు సంబంధించి సీఎంఆర్ రైస్ గడువు ముగియనుంది. ఈసీజన్‌ల సీఎంఆర్ రైస్ కేటాయింపులో ఇక గడువు ఇచ్చేదేలేదని అధికారులు తెల్చి చెబుతున్నారు.

వానాకాలం సీఎంఆర్ ఆలస్యంపై మిల్లులపై ఒత్తిడి

గత వానాకాలం సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ గడువు ఇదివరకే ముగిసింది. అయితే మిల్లుల యాజమాన్యాలు కోరిన నేపథ్యంలో పలుమార్లు గడువును పొడగించారు. గత యాసంగి సీజన్‌కు కూడా గడువు దగ్గర పడుతుంది. అయితే దీనికి మరోమారు పెంచేందుకు అవకాశం ఉండడంతో మిల్లుల యాజమాన్యాల జోలికి వెళ్లడం లేదని సివిల్ సప్లయ్ అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని గోదాంలు ఖాళీ లేక సీఎంఆర్ రైస్‌తో నిండుగా ఉండడంతో మిల్లర్లు ఇవ్వలేని పరిస్థితి ఎదురవుతుంది. ఈనేపథ్యంలో మిల్లులకు కేటాయింపు, వాటిని తిరిగి ఎఫ్‌సీఐ సేకరణ ప్రారంభంలో కొంత ఆలస్యం చోటుచేసుకుంది. దీంతో సీఎంఆర్ అప్పగించడానికి కొందరు వెసులుబాటు ఇచ్చే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. కానీ వానాకాలం విషయంలో ఇప్పటికే ఆలస్యం అవడంతో అధికారులు ఒత్తిడి పెంచుతున్నారు.



భిక్కనూరులో పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

పల్లె ప్రకృతి వనాలను అందంగా తీర్చిదిద్దాలి

- మొక్కల నాటడంపై నిర్లక్ష్యం వహించొద్దు
- ప్రతీ ఇంటికి ఐదు మొక్కలు ఇచ్చి నాటేలా చూడాలి: రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ప్రత్యేకాధికారి, ఐఎఫ్‌ఎస్ షఫియుల్లా

భిక్కనూరు, ఆగస్టు9: బృహత్, పల్లె ప్రకృతివనాలను అందంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ప్రత్యేక అధికారి, ఐఎఫ్‌ఎస్ షఫియుల్లా స్థానిక అధికారులను ఆదేశించారు. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న శ్రీ సిద్ధరామేశ్వర స్వామిఆలయంలో స్వామివారిపూజకు ఉపయోగపడే మొక్కలను నాటాలని సూచించారు. శుక్రవారం ఆయన భిక్కనూరు మండలకేంద్రంలోని సిద్దరామేశ్వర ఆలయసమీపంలోని బృహత్ ప్రకృతివనం, మండలంలోని జంగంపల్లి, లక్ష్మీదేవునిపల్లి గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా పల్లెప్రకృతి వనాలను పరిశీలించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు అతిపురాతమైన ఆలయ సమీపంలోగల పదెకరాల విస్తీర్ణంలో ఉన్న బృహత్ ప్రకృతివనంలో స్వామివారి పూజలకు ఉపయోగపడే తులసీవనం, నక్షత్రవనం, పూలవనాలను ఏర్పాటుచేయాలని అన్నారు. ప్రస్తుత బృహత్ పకృతివనంలో పిచ్చి మొక్కలను, గడ్డిని తొలగించి మొక్కలు ఎండిన చోట, ఖాళీగా ఉన్నచోట కొత్త మొక్కలను నాటాలని సూచించారు. ప్రపంచ పర్యావరణ సంస్థ వారు హరితహరంలో భాగంగా నాటిన మొక్కలు, పల్లె, బృహత్ పకృతివనాలలో 100శాతం మొక్కలు బాగుంటే ఎకరాకు రూ.12,500లను ప్రోత్సాహకంగా ఇవ్వనుందని, అందుకు సెప్టెంబర్‌లో ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో సర్వే ఉంటుందన్నారు. మొక్కలపట్ల నిర్లక్ష్యం వహించొద్దని, నాటిన మొక్కలను సంరక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల పునరుద్ధరించిన సిద్ధరామేశ్వర ఆలయ కోనేరును పరిశీలించి ఆలయ, కోనేరు చరిత్రను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

• వేతనాలు వచ్చాయా..

ఉద్యోగులందరికీ వేతనాలు వచ్చాయా అని ప్రత్యేకా అధికారి షఫియుల్లా భిక్కనూరు మండల ఆయాశాఖల అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా ఉంటే తన దృష్టికి తేవాలని చెప్పారు. కార్యక్రమంలో పీడీ సురేందర్, మండల ప్రత్యేక అధికారిణి రజిత, ఎంపీడీవో రాజ్‌కిరణ్ రెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్, గ్రామ పంచాయతీ ఈవో మహేష్‌గౌడ్, ఉన్నారు.

- ఏడాది గడిచినా పనులు ప్రారంభం శూన్యం
- రూ. 2కోట్ల 11లక్షల 66 నిధుల మంజూరు
- అధికారులు ఏర్పాట్లు చేసినా శంకుస్థాపనకు నోచుకోని వైనం
- లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలంటూ రైతుల వేడుకోలు

సబ్‌స్టేషన్ నిర్మాణం హుళక్కేనా?

నిజాంసాగర్, ఆగస్టు9: మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో సబ్‌స్టేషన్ మంజూరైనా నిర్మాణ పనులకు నోచుకోవడం లేదు. అధికారులు, పాలకులు ఇప్పటికీ నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టలేకపోతున్నారు. దీంతో లోవోల్టేజీ సమస్యతో బాధపడుతున్న రైతులు ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. మహ్మద్‌నగర్ మండల కేంద్ర శివారులో గత యేడాది క్రితమే స్థలాన్ని సేకరించి అధికారులకు అప్పగించారు. అప్పటి తెలంగాణ ప్రభుత్వం 2023 మే నెలలోనే సబ్ స్టేషన్‌ను మంజూరు చేస్తూ ఈ స్టేషన్‌నిర్మాణానికి రూ. 2కోట్ల 11లక్షల 66 మంజూరు చేసింది.

• జూన్‌లోనే టెండర్ల ప్రక్రియ

2024 జూన్ నెలలోనే నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తిచేసింది. ఇప్పటివరకు సబ్ స్టేషన్ నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతూనే ఉన్నాయి. ఈ సబ్ స్టేషన్ నిర్మాణానికి అధికారులు ఎవరి చేతుల మీదుగా చేపడ తారనేది ప్రశ్నార్థకంగా మారింది. డిసెంబర్ మాసంలో ఎన్నికలు పూర్తి కాగా ఎన్నికల కోడ్ ఉండటంతో అధికార యంత్రాంగం టెండర్ల ప్రక్రియ అప్పట్లో పూర్తి చేయలేకపోయారు. 2024లో టెండర్ల ప్రక్రియ పూర్తిచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం జరుగడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. నిజాంసాగర్ మండలం నుంచి విడిపోయి నూతన మండలంగా మహ్మద్‌నగర్ ఏర్పడింది. మహ్మద్‌నగర్ మండలం నుంచే ఉభయ జిల్లాల జిల్లా పరిషత్ కామారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా దఫేదార్ రాజు, శోభలు 10 సంవత్సరాల పాటు కొనసాగారు. సబ్ స్టేషన్ నిర్మాణానికి దఫేదార్ రాజు టీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సబ్ స్టేషన్ మంజూరు చేయించుకున్నారు. మంజూరైన వాటికి అధికార ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలుచేసి నిర్మాణం పనులు ప్రారంభించలేక పోవడం పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి.

• లోవోల్టేజీ సమస్య తీరేదెన్నడు?

మహ్మద్‌నగర్, బూర్గుల్, గున్కుల్, నర్వ, తుంకిపల్లి, తుర్కపల్లి, గ్రామాల రైతులలో వోల్టేజీ సమస్య తీర్చడానికి ఈ సబ్ స్టేషన్ మంజూరైంది. నిజాంసాగర్ పవర్‌హౌజ్ పరిసర ప్రాంతంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాఅయ్యేది. ఈ సబ్‌స్టేషన్‌లో లోడ్ అధికంగా ఉండటంతో ఈ గ్రామాలకు లో వోల్టేజీ కరెంట్ సమస్య తలెత్తుతూ ఉండేది. ఈ సమస్య ఉండటంతో అటవీ పరిసరాల ప్రాంతంలో చిరుత పులుల బెడద ఉంది. సబ్ స్టేషన్‌లో సాంకేతిక లోపాలు తలెత్తితే సిబ్బంది మరమ్మతులు చేయడానికి ఎంతో భయపడుతూ ఉండేవారు. ఈ సబ్‌స్టేషన్‌ను మహ్మద్‌నగర్‌కు తరలించాలని రైతులు అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు. 33/11 కేవీ నుంచి హసన్‌పల్లి, పవర్ హౌజ్, అన్నాసాగర్, అజాంబాగ్, నర్వ, బూర్గుల్, మహ్మద్‌నగర్, గున్కుల్, తుంకిపల్లి, తుర్కపల్లి ప్రాంతాలకు సరఫరా అయ్యేది. ఈ సబ్‌స్టేషన్ నుంచి మహ్మద్‌నగర్ పరిధిలో ఐదు గ్రామాలను విడదీస్తూ కొత్తగా మహ్మద్‌నగర్‌లో సబ్ స్టేషన్‌కు 2023 ఏప్రిల్‌లో ట్రాన్స్‌కో అధికార యంత్రాంగం ప్రతిపాదనలు పంపగా, 2023 మే నెలలో మంజూరైంది. గ్రామస్తులు సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలసేకరణ చేసి అధికారులకు అప్పగించారు. తెలంగాణ ప్రభుత్వం అధికారం కోల్పోయింది. సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టడంలో పాలకులు, అధికారులు అలసత్వం చేస్తున్నారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎప్పుడు శ్రీకారం చుడతారో ప్రశ్నార్థకంగా మారింది.వెంటనే పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణం చేసేందుకు కేటాయించిన స్థలం ఇదే..



ఐడీసీఎంఎస్ నూతన చైర్మన్‌ను కలిసిన నాయకులు

జక్రాన్‌పల్లి, ఆగస్టు 9 : నూతనంగా ఎన్నికైన ఐడీసీఎంఎస్ చైర్మన్ భగవత్‌తారచంద్ సింగ్‌నాయక్‌ను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. శుక్రవారం ఐడీసీఎంఎస్ చైర్మన్ భగవత్‌తారచంద్ సింగ్‌నాయక్‌ను అర్గుల్ సింగిల్‌విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, మాజీఎంపీపీలు అప్పాల పెద్దరాజన్న, కె.అనంత్‌రెడ్డి కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ జితేందర్‌నాయక్, జక్రాన్‌పల్లి మాజీ ఎంపీటీసీ రూపాల గంగారెడ్డి పాల్గొన్నారు.

అకడమిక్ డీఎంఈ రాజీనామా!

- ఆ పోస్టు తనకొద్దంటూ సర్కారుకు శివరాంప్రసాద్ లేఖ
- కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు తేవాల్సిందేనని ఉన్నతాధికారుల ఒత్తిడి!
- అది భరించలేకనే తప్పుకొన్న శివరాం?

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడు డాక్టర్ శివరాంప్రసాద్ తన పదవికి రాజీనామా చేశారు. తనను ఆ పోస్టు నుంచి తప్పించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. తాను అకడమిక్ డీఎంఈగా విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్నానని లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. వైద్యవిద్య సంచాలకుల పరిధిలో జరిగిన సాధారణ బదిలీల కంటే ముందే ఆయన సర్కారుకు రాజీనామా లేఖను పంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొద్ది రోజులుగా ఆయన డీఎంఈ కార్యాలయానికి కూడా రావడం లేదు. వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడిగా తీవ్రమైన పనిభారం, ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేకనే ఆ పోస్టు నుంచి తప్పుకొన్నారని శివరాంప్రసాద్ సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్తగా 8 వైద్య కళాశాలల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ, అధ్యాపకులు, సౌకర్యాల లేమి కారణంగా 8 కాలేజీలకు జాతీయ వైద్య మండలి అనుమతి ఇవ్వలేదు. దీనిపై డీఎంఈ కార్యాలయం అప్పీలుకు వెళ్లగా.. నాలుగింటికి అనుమతులు వచ్చాయి. మరో నాలుగు పెండింగ్‌లో ఉన్నాయి. ఎలాగైనా సరే వాటికి అనుమతులు తీసుకురావాల్సిందేనని ఉన్నతాధికారులు డీఎంఈ కార్యాలయంపై ఒత్తిడి తీసుకొచ్చారు. అది భరించలేకనే ఆయన అకడమిక్ డీఎంఈ పదవి నుంచి వైదొలగినట్లు తెలుస్తోంది.

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థి మృతి

- అర్ధరాత్రి ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత
- తెల్లవారుజామున ఆస్పత్రికి తరలింపు
- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- టీచర్ల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 9: అర్ధరాత్రి అస్వస్థతకు గురైన ఇద్దరు గురుకుల విద్యార్థులను తెల్లవారుజామున ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి ఒకరు మృతి చెందగా.. మరొకరు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఎలమాడల అనిరుధ్ (11), జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన మొండి మోక్షిత్ గురుకులంలో ఆరోతరగతి చదువుతున్నారు. వీరిద్దరూ గురువారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి నిద్రపోయారు. అయితే అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో పీఈటీ వెళ్లగా.. కడుపు నొప్పిగా ఉందని అనిరుధ్, మోక్షిత్‌లు తెలిపారు. దీంతో వెంటనే కేర్‌టేకర్‌లు, అనిరుధ్ తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి వారిని కోరుట్ల ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అనంతరం విషమంగా ఉందని తెలపడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పతికి తీసుకెళ్లారు. అప్పటికే విషయం తెలిసి వైద్యుడు కూడా అయిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్.. విద్యార్థులు పాము కాటుకు గురై ఉండవచ్చని అందుకు తగిన వైద్యం చేయాలని ఆర్మూర్‌లో వైద్యులకు సూచించారు. అక్కడ వైద్యం అందించి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అనిరుధ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోక్షిత్ పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో చికిత్స అందిస్తున్నారు. ఇటు పాఠశాలలో ప్రార్థనా సమయంలోనే ఆరో తరగతి చదువుతున్న హేమంత్ అనే మరో విద్యార్థి కూడా కళ్లు తిరుగుతున్నాయని కింద పడిపోయాడు. గమనించిన ఉపాధ్యాయులు మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, 2 వారాల క్రితం ముగ్గురు విద్యార్థులు ఇదే విధంగా అస్వస్థతకు


అనిరుధ్ (ఫైల్)

గురయ్యారు. వీరిలో చికిత్స అనంతరం ఇద్దరు కోలుకోగా.. 8వ తరగతి చదివే ఆర్.గణాధిత్య (13) మృతి చెందాడు. అయితే వీరు పాము కాటుకు గురైనట్లు సమాచారం.

ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం..

విద్యార్థి అనిరుధ్ మృతి విషయం తెలిసి కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ గురుకులానికి చేరుకున్నారు. విద్యార్థి మృతికి కారణాలేంటని అక్కడి ఉపాధ్యాయులు ప్రశ్నించారు. అయితే తమకేం తెలియదని వారు సమాధానం చెప్పడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, విద్యార్థుల వరుస మరణాలకు ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో వసతులు సరిగా లేవని.. తమ పిల్లల భద్రత మాటేంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

ప్రాణం తీసిన ఇన్‌స్టా స్నేహం

- ప్రేమ పేరిట యువకుడి వేధింపులు.. బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య


తేజస్విని (ఫైల్)

గుమ్మడిదల, ఆగస్టు 9: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తితో చేసిన స్నేహం ఓ యువతి ప్రాణాలు తీసింది. ప్రేమ పేరుతో ఆ యువకుడి వేధింపులు భరించలేక ఓ బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. తమ ఇంటి భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన రాజు, సోనీ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె తేజస్విని(20) ఉన్నారు. బీఫార్మసీ సెకండియర్ చదువుతున్న తేజస్వినికి అదే గ్రామానికి చెందిన శ్రీహరి కొద్ది రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. కొద్ది రోజుల తర్వాత తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని శ్రీహరి వేధించడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై తేజస్విని కుటుంబసభ్యులను కూడా బెదిరించాడు. దీంతో తేజస్విని ఇంట్లో నాలుగు రోజుల క్రితం కూడా గొడవ జరిగింది. ఈ క్రమంలో శ్రీహరి వేధింపులు తాళలేకపోయిన తేజస్విని గురువారం రాత్రి తమ ఇంటి భవనం మూడో అంతస్తు నుంచి దూకేసింది. రక్తపుమడుగులో పడి ఉన్న తేజస్వినిని కుటుంబసభ్యులు హుటాహుటిన సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించింది.

పీర్జాదిగూడ కార్పొరేషన్ హస్తగతం

పీర్జాదిగూడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఖాతాలోకి మరో మునిసిపల్ కార్పొరేషన్ చేరింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం నగర పాలక మండలి సమావేశం జరిగింది. మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉండగా.. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 21 మంది ఓటు వేశారు. దీంతో మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లుగా ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. త్వరలోనే మేయర్ ఎన్నికకు తేదీ ఖరారు అయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు కొనసాగిన అరాచక పాలనకు తెరపడిందని అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన 12వ డివిజన్ కార్పొరేటర్ అమర్‌సింగ్‌ను తమ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు.

పూడికతీతతో పూర్వస్థితి

ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడిక తీయాలి

- వచ్చే ఇసుకతో ప్రభుత్వానికి ఆదాయం
- మట్టిని రైతులకు ఉచితంగా ఇవ్వాలి
- 14లోగా ప్రతిపాదనలు అందించాలి
- మంత్రివర్గ ఉపసంఘం ఆదేశం


ప్రాజెక్టుల్లో పూడికతీతపై సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడికతీత పనులు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ప్రాజెక్టుల రక్షణలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ ఉండరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులకు ఏటా వచ్చే భారీ వరదతోపాటు పూడిక కూడా వచ్చి చేరుతోందని తెలిపింది. దీంతో ప్రాజెక్టుల సామర్థ్యం తగ్గుతున్నందున.. పూడికతీతతో పూర్వస్థితిని పునరుద్ధరించాలని సూచించింది. శుక్రవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉపసంఘం సమావేశం జరిగింది. పూడికతీతకు ఏయే చర్యలు తీసుకోవచ్చనే దానిపై నీటిపారుదల, మైనింగ్ శాఖలు సమగ్ర నివేదిక రూపొందించి, 14లోగా అందించాలని మంత్రివర్గం ఆదేశించింది. పూడిక వల్ల డ్యామ్ సేఫ్టీ సమస్యలు తలెత్తడంతోపాటు ఆయకట్టు తగ్గిపోతోందని, తాగునీటి అవసరాలపైనా దీని ప్రభావం పడుతుందని మంత్రులు పేర్కొన్నారు. ప్రాజెక్టుల్లో పూడికతీతకు పర్యావరణ అనుమతి అవసరంలేదని కేంద్రం చెప్పినందున..దానికనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. పూడికలో ఇసుక ఉంటే నిర్మాణ అవసరాలకు వినియోగించుకోవాలని, సారవంతమైన మట్టి ఉంటే రైతాంగానికి ఉచితంగా అందించాలని సూచించారు. పూడికను రైతులే స్వయంగా తీసుకెళ్లేలా విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు.

35 టీఎంసీల నిల్వను కోల్పోయాయి!

మహారాష్ట్ర, రాజస్థాన్‌లో వాణిజ్య అవసరాలకు ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాజెక్టుల్లోని పూడికను వినియోగించుకుంటున్నారని అధికారులు మంత్రివర్గ ఉపసంఘానికి తెలిపారు. యంత్రాల సహాయంతో డ్రెడ్జింగ్ చేస్తూ పూడిక తీస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పీ) కింద 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు 35 టీఎంసీల నిల్వను కోల్పోయినట్లు తేలిందని నివేదించారు. ఏటా పూడిక తీతకు టెండర్లు పిలిచి ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తే.. ఇసుక తరలింపుతో ట్యాక్స్, సెస్, జీఎస్టీ, ఇతర రాయల్టీలతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని అన్నారు. పూడిక వల్ల జలాశయాలు ఏటా 0-5 శాతం నిల్వలను కోల్పోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 25 ఏళ్లకు పైగా నిండిన జలాశయాలున్నాయని, ప్రయోగాత్మకంగా కొన్నింట్లో పూడికతీత చేపట్టి.. ఆ తరువాత మొత్తం 159 జలాశయాల్లో అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరించారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను మింగుతున్న పూడిక

ఏటా వరదల సమయంలో జలాశయాల్లోకి నీటితోపాటు పూడిక వచ్చిచేరుతుండడంతో ప్రాజెక్టుల సామర్థ్యం ఏయేటికాయేడు తగ్గిపోతోంది. ఈ పూడిక.. ప్రాజెక్టుల ఆయుష్షును కూడా తగ్గిస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్‌ను 1923లో అప్పటి నిజాం ప్రభుత్వం నిర్మించగా... ఈ ప్రాజెక్టు 1967 నాటికి 52.10 శాతం సామర్థ్యం కోల్పోయింది. అప్పట్లో నిజాంసాగర్‌కు ఎగువన ప్రాజెక్టులే లేకపోవడంతో వచ్చే వరద పూడికతో సహా జలాశయంలో చేరడంతో ప్రాజెక్టు సామర్థ్యం సగానికి పైగా తగ్గింది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2016లో నిర్మించిన ర్యాలివాగు సామర్థ్యం 43.30 శాతం మేర తగ్గింది. శ్రీశైలం ప్రాజెక్టు 1976లో అందుబాటులోకి రాగా... 45 ఏళ్లలో పూడిక కారణంగా 29.96 శాతం మేర నీటినిల్వ సామర్థ్యం కోల్పోయింది. ఇక నాగార్జునసాగర్ 23.52 శాతం నిల్వ సామర్థ్యం తగ్గింది. మొత్తంగా రాష్ట్రంలో 929 టీఎంసీల సామర్థ్యం కలిగిన 159 భారీ రిజర్వాయర్లు ఉండగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించారు. ఇందులో ఈ ప్రాజెక్టుల సామర్థ్యం 35 టీఎంసీల మేర కోల్పోయిందని గుర్తించారు. ప్రాజెక్టుల్లో పూడిక చేరకుండా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నదీ తీర ప్రాంతాలు కోతకు గురికాకుండా మొక్కల పెంపకం వంటి చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ నిపుణులు సూచిస్తున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వాటిని పూడిక మింగుతోంది. ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) మార్గదర్శకాల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మించాలంటే భూసేకరణ, నిర్మాణ ఖర్చులు కలిపి రూ.162 కోట్లు అవుతాయని లెక్క ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో ఎన్‌హెచ్‌పీ కింద అధ్యయనం చేసిన జలాశయాలు రూ.5670 కోట్ల మేర నష్టపోయాయి.

నిర్మల్ వాసి ఆడు జీవితం

- సౌదీలో ఒంటెల కాపరిగా నామ్‌దేవ్
- రక్షించాలంటూ సెల్ఫీ వీడియో
- టీజీఎండీసీ చైర్మన్ అనిల్ ట్వీట్‌తో భారత ఎంబసీ స్పందన
- నామ్‌దేవ్ ఆచూకీ గుర్తించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దళారుల మాటలు నమ్మి భారత్ నుంచి సౌదీ అరేబియా వెళ్లి ఎడారిలో ఒంటెల కాపరిగా పని చేసే ఓ వ్యక్తి దుర్భర జీవితం ఇతివృత్తంగా ఇటీవల ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. తెలంగాణలోని నిర్మల్ జిల్లాకు చెందిన రాథోడ్ నామ్‌దేవ్(51) అనే వ్యక్తి ఆ సినిమాలో మాదిరిగా సౌదీ ఎడారిలో దుర్భర జీవితం గడుపుతున్నాడు. ఈ కష్టాల నుంచి రక్షించండి అని వేడుకుంటూ నామ్‌దేవ్ ఇటీవల సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో పెట్టడంతో ఈ విషయం బయటికొచ్చింది. నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు స్పందన రావడంతో అతను స్వదేశానికి వచ్చే అవకాశం కనిపిస్తోంది. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) ఛైర్మన్ ఈరవత్రి అనిల్ స్పందించారు. నామ్‌దేవ్‌ను సురక్షితంగా స్వదేశానికి చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి, కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులను ఎక్స్(ట్విటర్) ద్వారా కోరారు. దీంతో కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులు నామ్‌దేవ్‌ను సంప్రదించారు. కువైత్ సరిహద్దులోని సౌదీ అరేబియా ఎడారిలో నామ్‌దేవ్ ఉన్నట్లు గుర్తించారు. చాలా కాలంగా గల్ఫ్‌లో ఉంటున్న నామ్‌దేవ్‌ను అతని యజమాని పది నెలల క్రితం సౌదీలోని ఒంటెల క్షేత్రానికి తరలించినట్టు తెలిసింది. కాగా, సౌదీ, కువైత్‌లోని ప్రవాసీయులు నామ్‌దేవ్‌ను సంప్రదించేందుకు యత్నించగా అతని ఫోన్ స్విచ్చాఫ్‌లో ఉంది. నామ్ దేవ్‌ను ఏ విధంగా స్వదేశానికి పంపిస్తారో తెలియాల్సి ఉంది.

సీపీజెట్ ఎంట్రన్స్‌లో ఇందూరువాసికి మొదటిర్యాంక్


నిహారిక

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 9 : ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన సీపీజెట్ ఎమ్ఎస్సీ డాటా సైన్స్- 2024 ఎంట్రన్స్ ఎగ్జామ్స్‌లో ఇందూరు వాసికి మొదటిర్యాంక్ వచ్చింది. ఇటీవల జరిగిన పరీక్షలో తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటి ర్యాంక్‌ను నిజామాబాద్ పట్టణం జెండాగల్లికి ఎందిన మంచిర్యాల బ్రహ్మం, వనజ దంపతుల కుమార్తె అయిన మంచిర్యాల నిహారిక రాష్ట్ర స్థాయిలోనే మొట్టమొదటి ర్యాంక్ సాధించింది. నిహారిక తండ్రి బతుకుదెరువు కోసం దుబాయ్‌కి వలస వెళ్లాడు.

నవీపేటలో కొండచిలువ మృతి


నవీపేటలో జేసీబీ తగిలి మృతిచెందిన కొండచిలువ

నవీపేట, ఆగస్టు 9 : మండలకేంద్రంలోని లింగమయ్య గుట్ట సమీపంలో అలీసాగర్ కాలువపై నూతనంగా వంతెన నిర్మాణం కోసం సంబంధిత స్థలాన్ని జేసీబీతో చదును చేయించారు. ఈ సమయంలో పొదల్లో ఉన్న భారీ సైజు కొండ చిలువకు జేసీబీ తగలడంతో అది తీవ్రంగా గాయపడి మృతి చెందింది. సంబంధిత కొండ చిలువ సుమారు 12ఫీట్ల వరకు ఉంటుందని వారు పేర్కొన్నారు. నాగుల చవితి రోజున కొండచిలువ మృతిచెందడం పట్ల స్థానికులు విచారం వ్యక్తం చేశారు.

సైబర్ నేరగాళ్ల 'వాట్సప్ కాల్'

నవీపేట, ఆగస్టు 9 : మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారికి సైబర్ నేరగాళ్లు ఇటీవల వాట్సప్ కాల్‌చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల మండలంలోని నాగేపూర్, సిరన్‌పల్లిలకు చెందిన పలువురికి సైబర్ నేరగాళ్లు వాట్సప్ కాల్ చేసి డబ్బులు ఇవ్వాలని బెదిరించగా శుక్రవారం మండలంలోని లింగాపూర్‌కు చెందిన కోరే గంగాధర్ అనే వ్యక్తికి వాట్సప్ కాల్ చేసి అతని కుటుంబ సభ్యుల వివరాలను అడిగాడు. దీంతో అప్రమత్తమైన కోరే గంగాధర్ సైబర్ నేరగాడికి ఫోన్‌లో గట్టిగా సమాధానం ఇవ్వడంతో ఫోన్ కట్ చేశాడు. సైబర్ నేరగాడు పోలీస్ యూనిఫామ్ ధరించి ఉన్న ఫోటోను డీపీగా పెట్టుకున్నాడని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్ఐ యాదగిరి గౌడ్‌ను వివరణ కోగా సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

నిందితురాలి రిమాండ్

నవీపేట, ఆగస్టు 9 : నిజామాబాద్ మండలం జలాల్‌పూర్‌కు చెందిన ఈర్నాల సావిత్రి అనే నిందితురాలిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్ తరలించడం జరిగిందని ఎస్ఐ యాదగిరిగౌడ్ తెలిపారు. గతనెల 25న అదే గ్రామానికి చెందిన గైనిశెట్టి గంగవ్వతో కుక్కర్ కొనుగోలు విషయంలో గొడవ జరిగిందని దీంతో సావిత్రి గంగవ్వ తలపై కత్తితో దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడిందని ఎస్ఐ తెలిపారు. ఈ విషయంపై అదేరోజు సావిత్రిపై హత్యాయత్నం కేసు నమోదు చేయగా శుక్రవారం నిందితురాలు సావిత్రిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్ఐ వివరించారు.

ఆర్థిక సహాయం అందజేత

ముప్కాల్, ఆగస్టు 9 : మండలంలోని రెంజర్ల గ్రామానికి చెందిన ఆశవర్కర్ న్యాకపులక్ష్మీ మూడురోజుల క్రితం రోడ్డుప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలికి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి అనుచరుల ద్వారా అందజేశారు. మూడురోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గుర్తైనట్టు తెలుసుకున్న సునీల్‌కుమార్ నిరుపేద కుటుంబమైన లక్ష్మీ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.

మొక్కలు నాటి.. సంరక్షించాలి

● జిల్లా అదనపు న్యాయాధికారి రవికుమార్


కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న న్యాయాధికారి

బోధన్‌రూరల్, ఆగస్టు 9 : మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని జిల్లా అదనపు న్యాయమూర్తి రవికుమార్ అన్నారు. శుక్రవారం బోధన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కోర్టు ప్రాంగణంలో న్యాయాధికారి, న్యాయవాదులు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం యొక్క అవశ్యకతను వివరిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. నాటిన మొక్కలను వృక్షాలుగా పెరిగే వరకు కాపాడడం, సంరక్షించడం మన అందరి బాధ్యత అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బోధన్ మేజిస్ట్రేట్ శేషతల్ప సాయి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పోశెట్టి, కార్యదర్శి కోటేశ్వర్ రావు, ఎం.గంగారెడ్డి, సీహెచ్‌వీ.హన్మంత్ రావు, బానోత్ రమేష్, గౌసోద్దీన్, అదనపు ప్రభుత్వ న్యాయవాది రవీందర్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య, సీనియర్ న్యాయవాదులు రాములు, గోపాల్ రెడ్డి, కోర్టు సిబ్బంది తదితరులున్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

● జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్

కమ్మర్‌పల్లి, ఆగస్టు 9 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు జరుపుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతగా గుర్తించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ అన్నారు. శుక్రవారం కమ్మర్‌పల్లి మండలంలోని అటవీశాఖ కార్యాలయంలో ఎంపీడీవో రాజా శ్రీనివాస్, తహసీల్దార్ ఆంజనేయులు, అటవీశాఖ క్షేత్రాధికారి రవీందర్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో కొనసాగుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో సదాశివ్, ఏపీవో విద్యానంద్ గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు బుచ్చిచల్లయ్య, సింగిరెడ్డి శేఖర్, అటవీశాఖ అధికారులు, సిబ్బంది, గ్రామస్థాయి అధికారులు ఈజీఎస్, ఐకేపి సిబ్బంది, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

టీయూలో మండవ జన్మదిన సంబరాలు


టీయూలో మాజీ మంత్రి మండవ జన్మదిన వేడుకలు

డిచ్‌పల్లి, ఆగస్టు 9 : తెలంగాణ యూనివర్సిటీలో మాజీమంత్రి మం డవ వెంకటేశ్వరరావు, శుక్రవారం జన్మదినం సందర్భంగా జేఏసీ అధ్య క్షుడు పుప్పల రవి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్‌లు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు. పుప్పల రవి మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధికి మండవ ఎంతో కృషి చేశారని, ఎమ్మెల్యేగా, మంత్రిగా అభివృద్ధి చేసిన మండవ వెంకటేశ్వరరావు జననేతగా ఎదగారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ ప్రొ.కనకయ్య, అధ్యాపకులు నాగరాజు, దత్తహరి, గంగాకిషన్, ఎన్ఎస్ యూఐ అధ్యక్షుడు శ్రీశైలం, రాజేందర్, నవీన్, శ్రీకాంత్, బాలాజీ, మహేందర్, మహేశ్, రవీందర్, నరేశ్, ధర్మవీర్ పాల్గొన్నారు.

బోధన్‌లో ఇరుపార్టీల మధ్య స్వల్ప ఘర్షణ

బోధన్‌రూరల్, ఆగస్టు 9 : బోధన్ పట్టణంలో శుక్రవారం కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య స్వల్పఘర్షణ చోటుచేసుకుంది. ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. ఈ విషయంపై పోలీసు స్టేషన్‌లో ఇరుపార్టీల నాయకులు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ వీరయ్య మాట్లాడుతూ ఇరుపార్టీల ఫిర్యాదులు తీసుకుని విచారణ చేపట్టామన్నారు.

రుణమాఫీ రాని రైతులకు న్యాయం చేయాలని వినతి

రెంజల్, ఆగస్టు9 : మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్ల రుణమాఫీకి అర్హులై ఉండి రుణమాఫీ కాని రైతులకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్ రెడ్డి, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు చుక్కరాజు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు రుణమాఫీకి అర్హులై ఉండి కూడా బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా రుణమాఫీ జరగకుండా నష్టపోయిన రైతులను ఆదుకుని వారికి సత్వరమే న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత బ్యాంకు అధిఆరులతో మాట్లాడి రెండు, మూడు రోజుల్లోగా నష్టపోయిన రైతుల వివరాలను సమర్పించాలని బ్యాంకు అధికారులను ఆదేశించడం జరిగిందని వారన్నారు. తక్షణమే స్పందించిన కలెక్టర్‌కు రెంజల్ మండల రైతుల పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నామని వారన్నారు. కార్యక్రమంలో రెంజల్ మండల బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ స్వాతంత్ర వేడుకలకు టీయూ వలంటీర్లు

డిచ్‌పల్లి, ఆగస్టు 9 : న్యూఢిల్లీలో జరిగే స్వాతంత్ర వేడుకల్లో ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం విద్యార్థులకు రావడం తెలంగాణ యూనివర్సిటీకే గర్వకారణమని టీయూ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి అన్నారు. శుక్రవారం స్వాతంత్ర్య వేడుకలకు ఎంపికైన వలంటీర్లను రిజిస్ట్రార్ అభినందించారు. ఎంపికైన వారిలో వాలంటీర్లు, విజయశాంతి, జ్యోతి, (తెలంగాణ సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల,కామారెడ్డి), శివప్రసాద్, సాయిరాం, (గిరిరాజ్ కళాశాల)లకు దక్కడం సంతోకరమని, రిజిస్ట్రార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య వేడుకలను ప్రత్యక్షంగా వీక్షించడం మంచి ఆవకాశమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ప్రొ.రవీందర్‌రెడ్డి, ప్రోగ్రాం అధికారి చంద్రకళ, సురేశ్, పాల్గొన్నారు.

రాంపూర్‌లో వన మహోత్సవం

డిచ్‌పల్లి, ఆగస్టు 9: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛదనం-పచ్చదనం నినాదంతో శుక్రవారం మండలంలోని రాంపూర్(డీ) గ్రామంలో ప్రభుత్వ అధికారులు, వృద్ధాశ్రమం వద్ద రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్ మొక్క నాటారు. అనంతరం పీడీ సాయాగౌడ్ మాట్లాడుతూ... ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని ఇళ్ల ముందర నిల్వ నీటిని ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మోస్రా : మండలంలో గోవూర్, చింతకుంట, తిమ్మాపూర్, చే నెంబర్ తండా గ్రామాలతో పాటు మోస్రా మండల కేంద్రంలో స్వచ్ఛదనం, పచ్చదనంలో భాగంగా మోస్రా గ్రామ పంచాయతీ ప్రాథమిక వైద్య కేంద్రం ఆవరణలో మండల ప్రత్యేక అధికారి రమేష్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. గ్రామ పంచాయతీ ఆవరణలో ఉన్నటువంటి పాత సామాన్ అన్ని డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ గుంతలలో ఉన్న నీటిని తొలగించి శుభ్రం చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మండల వైద్యఅధికారి వినయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్‌కుమార్, ఏఎన్ఎం విజయలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ ప్రీతం, కారోబార్లు రాము, కాశీరాం, బిల్‌కలెక్టర్ గంగాధర్, ఆశవర్కర్లు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని ధర్నా

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 9 : ఆర్మూర్ పట్టణంతో పాటు పెర్కిట్, మామిడిపల్లి గ్రామాల్లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేపీ నాయకులు ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పెర్కిట్, కొటార్మూర్, మామిడిపల్లిలో ప్రభుత్వ అసైన్డ్‌భూమి, ఇరిగేషన్ స్థలాలు కబ్జాకు గురయ్యాయని, అదేవిధంగా పెర్కిట్‌లో విశాఖకాలనీలో 202సర్వే నెంబర్‌లో పాత నిమ్మలగార్డెన్ సమీపం వద్ద పెర్కిట్ బైపాస్ వద్ద, మామిడిపల్లిలోని 8వ వార్డులోని సాయిగార్డెన్ సమీపంలో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయ్యాయన్నారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఇంటి నెంబర్‌లు కేటాయించి కబ్జా అయిన వాటిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వభూమిని స్వాధీనం చేసుకొని పెన్సింగ్ ఏర్పాటు చేసి బోర్డులు పెటాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, జెస్సు అనిల్, కలిగోట గంగాధర్, ద్యాగ ఉదయ్, ఆకుల శ్రీనివాస్, సుంకరి రంగన్న, కలిగోట ప్రశాంత్, రాజ్‌కుమార్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మోటార్లకు కెపాసిటర్లు బిగిస్తే విద్యుత్ ఆదా

● ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్

నందిపేట, ఆగస్టు 9 : వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకుంటే విద్యుత్ ఆదా చేయవచ్చని నిజామాబాద్ ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మాక్లూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ కేపాసిటర్లు బిగించడం వలన మోటార్లు తక్కువ కరెంట్‌ను తీసుకుంటుందని, దీని వలన మోటార్ల వైండింగ్ వేడి కాదని తెలిపారు. అంతే కాకుండా బోరు బావుల నుంచి మోటార్లు ఎక్కువ నీటిని తోడుతుందని చెప్పారు. అలాగే లోడు తగ్గి ట్రాన్స్‌ఫార్మర్ మీద భారం పడకుండా ఉంటుందని విద్యుత్తు శాఖ అధికారులు పేర్కొన్నారు.

చెరువులో పడి వృద్ధురాలి మృతి

కోటగిరి, ఆగస్టు 9 : పొతంగల్ మండల కేంద్రంలోని చెరువులో పడి గంగవ్వ (60) అనే వృద్ధురాలు మృతిచెందినట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గంగవ్వ మతిస్థిమితం లేదు. మూడురోజుల క్రితం చెరువు వైపునకు వెళ్లిన గంగవ్వ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. శుక్రవారం ఉదయం చెరువులో మృతదేహం లభ్యం కావడంతో స్థానికులు సమాచారం అందించారు. మృతదేహన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం బోదన్ ఏరియా ఆసుపత్రికి తరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

క్రీడాస్ఫూర్తితో జీవితంలో రాణించాలి

మెండోర, ఆగస్టు 9 : మండలంలోని పోచంపాడ్ బాలుర గురుకుల పాఠశాలలో కీ.శే. మనుగొండ శ్యామల జ్ఞాపకార్థం పాఠశాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ టోర్నీలో ప్రథమ స్థానంలో పోచంపాడ్ బాలుర గురుకుల విద్యార్థులు, ద్వితీయ స్థానంలో ముప్కాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచారు. కార్యక్రమంలో రిటైర్డు హెచ్ఎం అంజయ్య, నోముల శ్రీనివాస్, బాలుర గురుకుల పాఠశాల చైర్మన్ అక్తర్, వ్యాయమ ఉపాధ్యాయులు సంజీవ్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయాలి'

బోధన్‌రూరల్,ఆగస్టు9: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశం కోసం మరో పోరాటం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు వరదయ్యలు అన్నారు. శుక్రవారం బోదన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దేశంలో ప్రస్తుతం కార్పొరేటర్ల అవినీతి రాజకీయ నాయకుల దోపిడీ గురవుతుందని ఆరోపించారు. అధికారంలో ఉన్న మోడీ సర్కార్ ఈ దేశ సంపదను పెట్టుబడిదారులకు దోచి పెడుతున్నారని పేర్కొన్నారు. భూములు, గనులు, బ్యాంకులు, రైల్వే లైన్‌లు, ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, రక్షణ రంగాలను సైతం తమ అనుచరులకు ప్రైవేటుపరం పేరిట కట్టబెడుతున్నారని ఆరోపించారు.


నాగుపామును పట్టుకున్న బాబు

పెద్దమల్లారెడ్డి పాఠశాలలో పాము

• భయాందోళనకు గురైన విద్యార్థులు

భిక్కనూరు, ఆగస్టు9: మండలంలోని పెద్దమల్లారెడ్డి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నాగుపాము రావడంతో విద్యార్థులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. వెంటనే గ్రామ పంచాయతీ ఈవో లక్ష్మీకి సమాచారం ఇవ్వగా.. స్థానికుల ఆలోచన మేరకు స్థానికుడైనా పాములు పట్టే మరాఠి బాబుతోపామును పటించి గ్రామశివారులో అటవీప్రాంతంలో వదిలేశారు. అలాగే మండలకేంద్రంలోని హీరోహోండా షోరూంలో సర్వీసింగ్‌కు వచ్చిన బైక్‌లోపామును గుర్తించిన మెకానిక్‌లు కట్లపామును బయటకు తీసి సురక్షిత ప్రాంతంలో వదిలారు.

కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి

బాన్సువాడటౌన్, ఆగస్టు9: బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్‌కేర్ కార్మికులకు రావాలాల్సిన 3నెలల బకాయి వేనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కమర్, సురేఖ, సంతోష్, అనిల్, తదితరులున్నారు.

డ్రైవర్‌ను కొట్టి వాహనం చోరీ

లింగంపేట, ఆగస్టు9: వాహనాన్ని లీజుకు తీసుకుని అర్ధరాత్రి మార్గం మధ్యలో ట్యాక్సీడ్రైవర్‌ను కొట్టి వాహనం తీసుకుని పరారైన ఘటన లింగంపేట మండలం కన్నాపూర్‌లో చెటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాపూర్‌కు చెందిన దారబోయిన శ్రీకాంత్, అతని భార్య, కొడుకు కలిసి హైదరాబాద్‌లో గూడవల్లి స్టీవెన్‌కు చెందిన ఇన్నోవా వాహనాన్ని అద్దెకు తీసుకుని గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి కన్నాపూర్ గ్రామానికి బయల్దేరారు. రాత్రి ఒంటిగంటకు అటవీ ప్రాంతంలో కాలకృత్యాలంటూ శ్రీకాంత్ వాహనాన్ని ఆపాలని కోరారు. దీంతో డ్రైవర్ స్టీవెన్‌ను వాహనాన్ని పక్కన ఆపగానే శ్రీకాంత్, అతని భార్య ఇద్దరూ కలిసికొట్టి చున్నిని స్టీవెన్ మెడకు చుట్టి చంపటానికి ప్రయత్నించారు. స్టీవెన్ స్పృహతప్పి పడిపోగా ఇన్నోవా వాహనాన్ని, రెండు సెల్‌ఫోన్‌లను తీసుకుని పారిపోయారని స్టీవెన్ 100కు కాల్ చేసి ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చైత్యకుమార్ తెలిపారు.

చిల్డ్రన్ పార్క్‌ను ప్రారంభించిన ఎస్పీ

కామారెడ్డిటౌన్, ఆగస్టు9: కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఎస్పీ సింధూశర్మ చిల్డ్రన్ పార్క్‌ను ప్రారంభించి చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు అందించారు. అనంతరం పోలీసుస్టేషన్ ఆవరణను పరిశీలించడంతోపాటు స్టేషన్‌లో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసుస్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటుచేయాలని తెలిపారు. సామాన్య ప్రజానికానికి ఇబ్బందులు కలిగే విధంగా ప్రవర్తించే ఆకతాయిల పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని, మద్యం తాగి వాహనాలను నడిపేవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిన్నారులకు ఆహ్లాదాన్ని పంచేందుకు పోలీసుస్టేషన్‌లో చిల్డ్రన్‌పార్క్‌ను ఏర్పాటుచేయడంపై సీఐ చంద్రశేఖర్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ జార్జ్,సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ సీఐతిరుపతయ్య,ఆయా పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

'పెండింగ్ బిల్లులు ఇప్పించాలి'

భిక్కనూరు, ఆగస్టు9: తమ హయాంలో గ్రామపంచాయతీల్లో చేపట్టిన పనులకు ఇప్పటికీ బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమకు బిల్లులు వచ్చేలా కృషిచేయాలని భిక్కనూరు మండల మాజీ సర్పంచ్‌లు పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర ప్రత్యేక అధికారి, ఐఎఫ్ఎస్ షఫీయుల్లాకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీల్లో శ్మశానవాటికలు, డంపింగ్‌యార్డులు, పల్లె ప్రకృతి నవాలు, మురికికాలువలు, క్రీడాప్రాంగణాలు, మంకీఫుడ్ కోర్టులతో పాటుగా చాలా పనులను అప్పు చేసి చేపట్టామని వాటికి సంబంధించి బిల్లులు ఇప్పటికీ రాలేదని, చేసిన అప్పులకు వడ్డీ కట్టలేక ప్రతి సర్పంచ్ చాలా అవస్థలు పడుతున్నామన్నారు. రావాల్సిన పెండింగ్ బిల్లులను విడుదల చేసేలా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని మాజీ సర్పంచ్‌లకు ఆయన హామీఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మాద్దుల నర్సింలు, తునికి వేణు, గుడిసె రాములు, మధమోహన్‌రెడ్డి, నాగర్తి పోతిరెడ్డి, కందడి మనోహర రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మానవ మనుగడకు చెట్లే ఆధారం

రామారెడ్డి, ఆగస్టు9: మానవ మనుగడకు చెట్లే ఆధారమని, ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రామారెడ్డి మండలకేంద్రంలో శుక్రవారం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పక్కనే స్థలంలో మొక్కలు నాటారు. మధ్యాహ్నభోజనం, కస్తూర్బాగురుకుల పాఠశాలను పరిశీలించారు. ప్రతీఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ శ్రీనివాస్‌రావు, ప్రత్యేకాధికారి రాజేశ్వర్, ఇంచార్జ్ ఎంపీడీఓ తిరుపతిరెడ్డి, ఐకేపీ ఏపీఎం ప్రసన్నకుమార్, ఏపీఓ ధర్మారెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ వనిత, ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలి

కామారెడ్డిటౌన్, ఆగస్టు9: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార అన్నారు. శుక్రవారం హర్‌ఘర్ తీరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా హర్‌ఘర్ తీరంగా కార్యక్రమ సన్నాహక సమావేశంను నిర్వహించినట్లు తెలిపారు. ఈనెల 11 నుంచి 14వరకు బీజేపీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి, నాయకులు తేలు శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, వేణు, కౌన్సిలర్‌లు శ్రీకాంత్, శ్రీనివాస్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


వీక్లి మార్కెట్‌లో పుట్ట వద్ద పాలుపోస్తున్న మహిళలు

పాముకు పూజలు చేస్తున్న మహిళలు


పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ


భిక్కనూరులో పుట్టలో పాలు పోస్తున్న దృశ్యం

ఘనంగా నాగుల పంచమి

కామారెడ్డి టౌన్, ఆగస్టు 9: నాగుల పంచమి పండుగను శుక్రవారం కామారెడ్డి ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఆయా ప్రాంతాల్లోని పాముల పుట్టలవద్ద, ఆయా ఆలయాలు భక్త జనంతో కిక్కిరిసిపోయాయి. భక్తులు, మహిళలు పాము పుట్టలో ఆవు పాలు పోసి పూజలు నిర్వహించారు. పట్టణంలోని వీక్లి మార్కెట్, గంజ్, మున్సిపల్ వాటర్ వర్క్స్ కార్యాలయం, డిగ్రీ కళాశాల వద్దగల రాశీవనం, రైల్వేస్టేషన్, వివేకానందకాలనీ, ముదాంగల్లి, పెద్దమ్మ గల్లి, పంచముఖీహనుమాన్ ఆలయం, రాంమందిర్ రోడ్, అశోక్‌నగర్‌కాలనీ, శ్రీరాంనగర్‌కాలనీ తదితర కాలనీలోని పాము పుట్టలలో ఆవు పాలు పోశారు. వీక్లిమార్కెట్‌లు పాములు పట్టే వారు నాగుపామును అక్కడికి తీసుకునిరావడంతో మహిళలు పూజలు చేశారు. ఇల్చిపూర్ సరస్వతి ఆలయంలో మహిళలు పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ పుట్టవద్ద పూజలు నిర్వహించారు. ప్రసాదం గా జొన్నప్యాలాలు, శనగలు, స్వీట్లను దేవతల కు సమర్పించారు. అలాగే ఆనవాయితీగా వస్తున్న సోదరీమణులు తమ సోదరుల కళ్లను ఆవు పాలతో కడిగి సంస్కృతిని చాటారు. సోదరులు ఇచ్చిన కట్న కానుకలను సోదరీమణులు స్వీకరించి ఆశీర్వదించారు. కాగా పలు ప్రాంతాల్లో ఉచిత పాల పంపిణీ చేపట్టారు.

• బిచ్కుందలో..

బిచ్కుంద: మండలంలోని అన్ని గ్రామాలలో నాగులపంచమి వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. నాగదేవతల గుడివద్ద పాము పుట్టల వద్ద మహిళలు ఆవుపాలు, జొన్నపేలాలతో భక్తిశ్రద్ధలతో ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. నాగుల పంచమి సందర్భంగా జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ప్రత్యేకపూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు గుడి నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

• దోమకొండలో..

దోమకొండ: నాగపంచమి సందర్భంగా శుక్రవారం దోమకొండ, బీబీపేట మండలాల్లోని అన్ని గ్రామాల్లో మహిళలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. పుట్టవద్ద పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. దోమకొండ చాముండేశ్వరీ ఆలయం, శివరాంమదిర్, సంగమేశ్వర్ వెంకటేశ్వర ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

• భిక్కనూరులో..

భిక్కనూరు: మండలకేంద్రంతో పాటుగా మండలంలోని అన్ని గ్రామాల్లో నాగుల చవితి పండుగను మండల ప్రజలు భక్తిశ్రద్ధల నడుమ శుక్రవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయాన్నే స్నానమాచరించి మహిళలు తోబుట్టువుల కళ్లు కడిగి ఆయాగ్రామాల్లోని పుట్టల వద్ద పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని ఆయాగ్రామాల్లో యువజన సంఘాల ప్రతినిధులు, వ్యాపారులు మహిళలకు ఉచితంగా ఆవుపాలు పంపిణీ చేశారు. నాగుల చవితి పండుగ సందర్భంగా మండలంలోని శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంలో పాటుగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

• బాన్సువాడలో..

బాన్సువాడటౌన్: బాన్సువాడ పట్టణ ప్రజలు శుక్రవారం నాగులపంచమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఉదయం నుంచి ఇళ్లలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం పుట్ట వద్దకు వెళ్లిపాలు పోసి పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా తయారుచేసిన వంటకాలను కుటుంబ సభ్యులతో కలిసి ఆరగించారు.

• బీర్కూర్‌లో..

బీర్కూర్: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం నాగుల పంచమి వేడుకలను మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామ సమీపంలోని పుట్టల వద్దకు పాలుపోసి నాగదేవతకు మొక్కులు చెల్లించారు. నాగుల పంచమి సందర్భంగా లయన్స్ క్లబ్, కన్నయ్య మిల్క్ సెంటర్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా ఆవు పాలను పంపిణీ చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

• ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: పట్టణకేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో శుక్రవారం నాగుల పంచమి పండుగను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. పోచమ్మ ఆలయాలలో మొక్కులు చెల్లించుకుని అమ్మవారి సమీపంలో ఉన్న పుట్టలో పాలుపోశారు.

• పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్: మండలంలోని ఆయా గ్రామాలలో పంచమి వేడుకలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామ శివారులో గల పుట్ట వద్ద పూజలు నిర్వహించారు.

• మద్నూర్‌లో..

మద్నూర్: ఉమ్మడి మండలంలో మహిళలు నాగుల పంచమి పండుగ వేడుకలు శుక్రవారం వైభవంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా ఆలయంలో మహిళా భక్తులతో కిక్కిరిసిపోయాయి. మహిళలు పాము పుట్టలో ఆవు పాలు పోసి పూజలు నిర్వహించారు. ఉమ్మడి మద్నూర్, డోంగ్లి మండలాల్లో మహారాష్ట్ర సంప్రదాయం మేరకు సోదరీమణులు తమ సోదరులకు ఆవుపాలతో కండ్లు కడిగి సంస్కృతిని చాటారు. మండల కేంద్రంలో గోశాల అధ్యక్షులు సంజయ్ ఆవుపాలను ప్రజలకు ఉచితముగా పంపిణీ చేశారు. పాము పుట్ట వద్ద జొన్న పేలాలు, ఆవు పాలు పూలు పత్రీలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలు మొక్కులు తీర్చుకున్నారు.


బాన్సువాడలో మహిళల పూజలు


బీర్కూర్‌లో నాగ దేవత ఆలయం వద్ద..


పెద్ద కొడప్ గల్‌లో..


మద్నూర్‌లో పూజలు చేస్తున్న మహిళలు

ఘనంగా అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం


ఆదివాసి దినోత్సవంలో చిన్నారులతో ఆర్డీవో రమేష్ రాథోడ్

బాన్సువాడ, ఆగస్టు 9: పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో గ్రూప్ ఆఫ్ హెల్పింగ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అధ్యక్షతన వహించారు. బాన్సువాడ ఆర్డీవో రమేష్‌రాథోడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలో జరుగుతున్న అభివృద్ధికి గిరిజనులే మూలమన్నారు. విద్యార్థులు బాబా సాహెబ్ అంబేద్కర్‌ని స్ఫూర్తిగా తీసుకుని జ్ఞానాన్ని సంపాదించుకుని ముందుకు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ప్రభుత్వం గిరిజనుల కోసం తీసుకునే సంక్షేమ కార్యక్రమాలు వాడుకుని అందరూ అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రూప్ ఆఫ్ హెల్పింగ్ ఫ్రెండ్స్ వ్యవస్థాపకులు నరేష్ రాథోడ్, మోహన్ నాయక్, సురేష్‌కుమార్, దేవి సింగ్, అశోక్, శ్రీకాంత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ నుంచి నిజాంసాగర్ మీదుగా
హైదరాబాద్‌కు సిమిడీలక్స్ బస్సులు

నిజాంసాగర్, ఆగస్టు9: నిజామాబాద్ నుంచి నిజాంసాగర్ మీదుగా శుక్రవారం హైదరాబాద్‌కు సిమిడీలర్స్ బస్సులను ప్రారంభించినట్లు నిజామాబాద్ డివిజనల్ మేనేజర్ జాన్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్ డిపోకు చెందిన డీలక్స్ బస్సులు నిజామాబాద్ నుంచి వర్ని, బాన్సువాధ నిజాంసాగర్, ఎల్లారెడ్డి, మెదక్ మీదుగా వెళ్తాయని తెలిపారు. నిజాంసాగర్‌లో ఉదయం 8.45 గంటలకు, 10.15 గంటలకు రెండు సర్వీసులు వెళ్తాయని, తిరుగు ప్రయాణంలో నిజాంసాగర్‌కు 5గంటలకు, 6.15 గంటలకు వెళ్తాయని పేర్కొన్నారు. పల్లె బస్సులు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రద్దీగా ఉండటంతో ప్రయాణీకులు అనేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో నిజామాబాద్ డిపో నుంచి బస్సులు వేసినట్లు తెలిపారు. ఈ బస్సుల్లో మహిళలకు టికెట్ తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శిని మార్చాలంటూ వినతి

పెద్దకొడప్‌గల్, ఆగస్టు9: మండలంలోని లింగంపల్లి పంచాయతీ కార్యదర్శి రాజేందర్‌ను మార్చాలంటూ శుక్రవారం గ్రామానికి చెందిన యువకులు ఇంచార్జి ఎంపిడీవో లక్ష్మీకాంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన యువకులు మాట్లాడుతు పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉండటం లేదని, గ్రామంలో ఏమైనా సమస్యలు గురించి వివరిస్తే తనకు ఏం తెలియదని, ఏం చేసుకుంటారో చేసుకోండని దురుసుగా సమాధానం ఇస్తున్నారని వాపోయారు. వానాకాలం సీజన్ ప్రారంభమై 2నెలలైనా ఇప్పటివరకు పారిశుధ్యంపై చర్యలు తీసుకోలేదని తెలిపారు. గ్రామంలో చెత్తఎక్కడికక్కడే ఉంటుందని, దీంతో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకవచ్చిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామస్తులకు అందుబాటులో ఉండని కార్యదర్శి తమకు వద్దని అతడిని మార్చాలంటూ ఇన్‌చార్జి ఎంపీడీవోకు విన్నవించారు. కార్యక్రమంలో గ్రామస్థులున్నారు.


కార్మికులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి

• మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ

కామారెడ్డిటౌన్, ఆగస్టు9: కార్మికుల సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కార్మికులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కార్మికుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్నటువంటి సమస్యలపై కార్మికులతో చర్చించారు. విడుతల వారిగా పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ సుజాత, పట్టణ కౌన్సిలర్‌లు పాతశివకృష్ణమూర్తి, లతశ్రీనివాస్, చాట్లవంశీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈత మొక్కలు నాటిన ఎక్సైజ్ అధికారులు

నాగిరెడ్డిపేట, ఆగస్టు9: వనమహోత్సవంలో భాగంగా మండలంలోని చీనూర్ గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని శుక్రవారం ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ షకీర్‌అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో వంద ఈత మొక్కలు నాటారు. గ్రామానికి చెందిన నారాగౌడ్ సాగు భూమిలో 90 ఈత మొక్కలు నాటారు.

దివ్యాంగులకు చేయూతనివ్వాలి: డీఈవో


విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కామారెడ్డిటౌన్, ఆగస్టు9: దివ్యాంగ పిల్లలకు పౌరులందరూ చేయూతనిచ్చి వారిలో మానసిక స్థైర్యం నింపాలని డీఈవో రాజు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని భవిత సెంటర్‌లో సమగ్రశిక్ష,భారత కృత్రిమ అవయవాల నిర్మాణసంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని 18 ఏళ్లలోపు దివ్యాంగ బాలబాలికలకు కావాల్సిన ఉపకరణాల గుర్తింపు ఈ శిబిరంలో జరుగుతుందని, ఈ సౌకర్యాన్ని అందరూ వినియోగించుకుని ఉపకరణాలు పొందాలని ఆయన విజ్ఞప్తిచేశారు. జిల్లాలోని గుర్తించబడిన 252 దివ్యాంగులలో 34మంది వినికిడిలోపం, 13మంది దృష్టిలోపం, 76మంది మానసిక వైకల్యం, 104మంది శారీర దివ్యాంగులుగా నమోదుచేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సహితవిద్య సమన్వయకర్త కృష్ణచైతన్య, గుణాత్మక విద్య సమన్వయకర్త వేణుగోపాల్, మండల విద్యాశాఖాధికారి ఎల్లయ్య, ప్రధానోపాధ్యాయుడు నరహరిరాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమం నిరంతరంగా సాగాలి

బిచ్కుంద, ఆగస్టు9: మొక్కలు నాటే కార్యక్రమం నిరంతరంగా కొనసాగాలని జడ్పీ సీఈవో బిచ్కుంద మండల ప్రత్యేకాధికారి చందర్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటి ఐదురోజుల పాటు పట్టణంలో చేపట్టిన కార్యక్రమాలను పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటిపరిసరాలు పరిశుభ్రత, గుంతలలో మురికినీరు తొలగించుట, పచ్చదనం కార్యక్రమాలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో బిచ్కుంద పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

ఎల్లారెడ్డి, ఆగస్టు9: యువజన కాంగ్రెస్ 64వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అన్నివర్గాల వారికి న్యాయం జరుగుతుందని ప్రజలసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఈకార్యక్రమంలో యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు సంతోష్‌నాయక్, మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, ఎన్.ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు నాగం శ్రీనివాస్, నాయకులు అజార్ ఖాద్రి, సాయిరాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ నాయకుల ఎంపికకు
నేటి నుంచి ఆన్‌లైన్ ఓటింగ్

మద్నూర్, ఆగస్టు9: యువజన కాంగ్రెస్ నాయకులను ఎన్నుకునే ఆన్‌లైన్ ఓటింగ్ నేటి నుంచి ప్రారంభం కానుంది. ఒకరు ఆరు ఓట్లు వేయాల్సి ఉంటుంది. ఓటింగులో పాల్గొనేవారు ఒకరు ఆరుగురికి ఓటు వేయాల్సి ఉంటుంది. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు,టౌన్ అధ్యక్షుడు, అసెంబ్లీ అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శికి ఇలా నాలుగు ఓట్లతో పాటు రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శికి కూడా ఓటు వేయాల్సి ఉంటుంది. ఓటుతో పాటు రూ.50 ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. ఈడబ్బులు పోటీలో ఉన్నవాళ్లే చెల్లిస్తారు. రాష్ట్ర జిల్లా అధ్యక్షుడికి సంబంధించిన ప్యానెల్ వారు తమకు మద్దతుగా ఓట్లను వేసిన వారి డబ్బును చెల్లిస్తారు.

చిన్నమొత్తాల పొదుపుపై అవగాహన

నాగిరెడ్డిపేట, ఆగస్టు9: తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే చిన్న మొత్తాల పొదుపుపై మండలంలోని మాల్తుమ్మెద గ్రామంలో తపాలాశాఖ అధికారులు శుక్రవారం గ్రామస్తులకు, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తపాల శాఖ ఇన్‌స్పెక్టర్ సుజిత్‌కుమార్ ఆధ్వర్యంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి తపాల శాఖ నిర్వహించే చిన్న మొత్తాల పొదుపు, వివిధ స్కీమ్‌లను సేవింగ్ ఖాతాలు, ఇన్సురెన్స్, స్కీమ్‌లను వాటి లాభాలను ఉపయోగాలను ప్రజలకు, విద్యార్థులకు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భగా ఆయన కోరారు. కార్యక్రమంలో మెయిల్ ఓవర్సీస్ మెహబూబ్‌రెడ్డి, నాగిరెడ్డిపేట్ ఎస్‌పీఎం ఆసిఫ్, అలీ, బీపీఎం నరేందర్, సిబ్బంది జాఫర్, విజయ్, నాగరాజు, గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

శాంతి	- ఓసీ
దర్శన్	- మురారి
ప్రియా 70	- కల్కి
ప్రియా 35	- కమిటీ కుర్రాళ్లు

బాన్సువాడ

మహేశ్వరి	- తిరగబడరాసామీ
వెంకటేశ్వర	- శివం భజే

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

